# అసలైన వైద్యం



*వరాహ వర్ద్రాణి నవౌదనాని*
*దధీని సన్నద్ధ రసాని చాత్ర*
*సుకోమలాః సర్షప కందళీశ్చ*
*భుక్త్వా జనో నిందతి వైద్య విద్యాం*

***భావం:*** మనుష్యుడు పంది మాంసాన్నీ, కొత్త బియ్యపు అన్నాన్నీ, పెరుగునూ, బహువిధ రుచులనూ, లేత ఆవకూరనూ తిని వైద్య విద్యను నిందిస్తాడు.

ఒకానొక గ్రామంలో ఒక సంపన్నుడు కొత్తగా నివాసం ఏర్పరచుకున్నాడు. అతడు ఆ చుట్టుపక్కల ప్రాంతం వాడు కూడా కాదు. ఆ

గ్రామంలో సారవంతమైన భూమి ఉందని తెలుసుకుని వ్యవసాయం ద్వారా ఇంకా ధనం గడించవచ్చని ఆ ఊరు వచ్చిభూమి కొని, మేడ కట్టుకుని, దాసదాసీ జనాన్ని ఏర్పాటు చేసుకుని, హాయిగా జీవించసాగాడు. ఊరిలో మంచి పలుకుబడి సంపాదించుకున్నాడు.

వేసవి కాలం వచ్చింది. సంపన్నుడికి అనారోగ్యం కలిగింది. గ్రామ వైద్యుడు ఊళ్లోలేడు. రాజధానిలో దండనాయకుడొకరికి చేతికి తీవ్రమైన గాయమైతే వైద్యానికి పిలిపించుకున్నాడు. దండనాయకునితో బంధుత్వమున్న వైద్యుడు రాజధానికి వెళ్ళాడు. గ్రామ వైద్యుని కుమారుడు తండ్రి దగ్గర విద్యను అభ్యసించాడు. అతడే సంపన్నుడికి వైద్యం చేయడం ప్రారంభించాడు.

ప్రతిరోజూ వైద్యుడి కొడుకు సంపన్నుడి నాడి చూసి, ఇతర పరీక్షలు చేసి ఔషధాలిస్తున్నాడు. కానీ రోగం నయం కావడం లేదు. సంపన్నుడు వైద్య యువకుడికి విద్యరాదన్నట్లుగా మాట్లాడసాగాడు. గ్రామస్థులకి కూడా తండ్రి దగ్గరే వైద్యం అలవాటు. తండ్రికున్న హస్తవాసి కొడుక్కి లేదన్నట్లుగా అందరూ అనుకోసాగారు.

అదృష్టవశాత్తూ దండ నాయకుడికి గాయం తొందరగానే నయమైంది. తండ్రి రాజధాని నుంచి తిరిగి వచ్చాడు. కొడుకు విషయమంతా చెప్పి 'నాకు మీరు వైద్య శాస్త్రం చెప్పారు. కానీ నాకు రోగం తగ్గించడం రాలేదు. మీరు అనుమతి ఇస్తే కాశీ వెళ్లి వేరే శాస్త్రం అభ్యసిస్తాను' అన్నాడు. తండ్రి 'నాయనా తొందరపడకు. ఒకసారి నేను కూడా ప్రయత్నిస్తాను'అన్నాడు.

తండ్రీ కొడుకులు సంపన్నుడి ఇంటికి వెళ్ళారు. తండ్రి రోగిని పరీక్షించి 'అయ్యా! రోజూ ఏం తింటున్నారు'. అన్నాడు. సంపన్నుడు "మా పొలంలో పంట మొన్ననే చేతికొచ్చింది.ఆ బియ్యం తింటున్నాను. ఈ ఊళ్లో పందులు పుష్టిగా ఉంటాయి. వాటి మాంసం ఆవ ఆకులతో వండించి, అందులో అన్ని రుచులూ మేళవించి, పెరుగుతో తింటున్నాను. చాలా బావుంటోంది. రోజూ అదే వంట" అన్నాడు. వైద్యుడు వెంటనే 'అయ్యా!

పెరుగు బదులు మజ్జిగ పుచ్చుకోండి. కొన్నాళ్లు మాంసం మానెయ్యండి. రుచులు తగ్గించి సాత్వికాహారం స్వీకరించండి. పాత బియ్యం నేను పంపిస్తాను. వాటితో వంట చేయించండి'అన్నాడు.

సంపన్నుడికి వారంలో ఆరోగ్యం చేకూరింది. వైద్యుడు కొడుకుతో 'నాయనా! వైద్యంలో ఔషధ ప్రక్రియ ఒక భాగం మాత్రమే. రోగి ఆహార విహారాలని కూడా వైద్యుడు గమనించాలి. లేకపోతే జనం తమకి అనారోగ్యకరమైనవి తిని వైద్యుడికి విద్య రాదంటారు. ఇంకా ఒక్కోసారి వైద్య విద్యే తప్పంటారు' అన్నాడు. విషయం తెలుసుకున్న కొడుకు కూడా మంచి పేరు తెచ్చుకున్నాడు.

పేషెంట్‌ని చూసీ చూడకుండానే పది రకాల టెస్టులు రాసి పడేసే నేటి కార్పొరేట్ డాక్టర్లు ప్రాచీన వైద్యుల్లా ఉంటే ఎంత బాగుంటుందో కదా. అది జరగని పనేమోకానీ, ఆహార విషయంలో జాగ్రత్త పాటించడం మన చేతిలో పని.

******